సవతిబిడ్డలు

మా ఊరి పేరు రంగాపురం. ఈ పేరు రావడానికి కారకుడైన మూలపురుషుడి పేరు రంగభూపతి. రంగాపురం చెరువు క్రింద భూముల్లో ఎక్కువభాగం రంగభూపతిగారివే గనుక ఆయన కది సార్థక నామధేయం. సన్నకారు రైతులపట్ల రంగభూపతిగారి గుండెల్లో ఎనలేని జాలి గూడుకట్టుకుని వుండేదట! వాళ్ళ లోతుబావులు, వాళ్ళ బక్కగొడ్లు, పండని పొలాలు, ఎండిన పైర్లు, మండే డొక్కలు, ఈ పీడను ఆయన తన రెండుకళ్ళతోనూ చూడలేకపోయారట! ఆలోచించగా ఈ సమస్యను చీల్చిపారేయడానికి చిన్ని కమతాలను రద్దుచేయడమొక్కటే ఆయనకు గత్యంతరంగా తోచిందట! అందుకు వీలుగా బక్కరైతులందరూ ఆ పాటికే రంగభూపతిగారి దగ్గర అప్పులూ సప్పులూ చేసే వున్నారు. ఆ అప్పులు వడ్డీలతో కలిసి ఏపుగా పెరిగి వున్నాయి. అదనంగా ఆయన దగ్గర నయమూ, భయమూ అన్న సాధనాలు రెండూ సర్వసిద్ధంగా వున్నాయి. చిటికెలో చిన్న కమతాలన్నీ అంతరించగా ఒకేఒక పెద్ద కమతం ఏర్పడింది. అలాగని చిన్న రైతులందరూ పొట్ట చేతబట్టుకుని పెళ్ళాం బిడ్డలను వెంటబెట్టుకుని దేశాలపాలై పోవాలన్న దురుద్దేశం రంగభూపతిగారికి ఏ కోశానా లేదు. 'పెట్టుబడి నాది. లాభనష్టాలు నావి. మీకేబాధ్యత అక్కర్లేదు. మనిషన్న తర్వాత ఎంతటివాడైనా తనకు తగ్గపని తాను చేయందే బ్రతుకు గడవదు. ఆ పని యిక్కడే చేయండి. మీక్కావలసిందల్లా తిండీ, బట్టా. ఆ రెంటికీ పూచీ నాది' అని ఆయన చిలక్కు చెప్పినట్టుగా చెప్పి చూశారు. విన్న బుద్ధిమంతులున్నారు. తల్లిరెక్కల క్రింద అణిగిమణిగి వుండే పిల్లల్లా వాళ్ళు బుద్ధిగా రంగభూపతిగారి పాలన క్రిందనే వుండిపోయారు. మిగిలిన వాళ్ళు దురభిమాన మొక్కటి మాత్రమే ఆస్తిగా దేశంపైన వూరేగడంకోసం రంగాపురం విడిచిపెట్టి వెళ్ళిపోయారు.

గ్రంథస్థం చేయకపోవడం చరిత్రకారుల పొరబాటేగానీ, రంగభూపతిగారు అర్థశాస్త్రంలో అందెవేసిన చేయి. స్వయంగా సృష్టించి, ఆయన స్వగ్రామంలో అమల్లో పెట్టిన ఆర్థిక సిద్ధాంతం విస్తృత ప్రచారానికి నోచుకోక పోవడం సమకాలీనుల దురదృష్టం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడంలో ఆయనకు మమకారాలు అడ్డుతగలలేదు. వాత్సల్యాలు ప్రతిబంధకం కాలేదు. రంగభూపతిగారికి ముగ్గురు కొడుకులు. సగటు లెక్కన ఆ ముగ్గురికి కొడుకులు పుడితే మూడో తరానికల్లా రంగాపురం ఎస్టేటుకు తొమ్మిదిమంది వారసులు తయారౌతారు. ఇంకొక మూడు తరాలు అలాగే గడిస్తే వారసుల సంఖ్య వందకు పైగా పెరిగి, బంగారం లాంటి రంగాపురం ఎస్టేటు మళ్ళీ చిన్న చిన్న చెక్కలుగా విడిపోయే ప్రమాదం తప్పకుండా ఏర్పడి తీరుతుంది. ఈ అనర్థం వాటిల్లకుండా వుండడంకోసం ఆయన రాగిరేకుపైన వ్రాయించి ఇనప్పెట్టెలో పెట్టిపోయిన తన మరణ శాసనంలో సుస్పష్టంగా ఒక కట్టడి చేసి పోయారు. అదేమిటంటే: ఈ ఎస్టేటు ఎల్లప్పటికిన్నీ కుటుంబంలో జ్యేష్ఠపుత్రుడికి మాత్రమే సంక్రమిస్తూ రావాలి. మిగిలిన వాళ్ళగతేమిటన్న ప్రశ్న యిక్కడ ఎదురుగావచ్చు! సృష్టిపుట్టిన నాటినుంచి ఈ 'మిగిలినవాళ్ళ'తో గొడవగానే వుంది. వీళ్ళకేదో ఒకదారి - చివరికి గోదారైనా సరే చూపించకపోతే వీళ్ళు తలారి

రాముడి బిడ్డల్లా పీక్కుతింటారని రంగభూపతిగారికి తెలుసు. అందుకనే ఆయన తన మరణశాసనంలో ఒక సబ్‌క్లాజ్ రూపొందించారు: జ్యేష్ఠ పుత్రుడు మినహా మిగిలినవాళ్ళకందరికీ నష్టపరిహారం క్రిందనైతే నేమి, జీవిత భరణంగానైతేనేమి, కొంత నికరమైన మొత్తం యిచ్చివేయబడుతుంది. ఆ మొత్తాన్ని చేతబట్టుకొని వాళ్ళు రంగాపురం విడిచి వెళ్ళిపోయినా వెళ్ళిపోవచ్చు. అలాగాక అక్కడే వుండిపోయేవాళ్ళకోసం రంగభూపతిగారు ఒకటి రెండు సదుపాయాలు చేకూరే వెరవు కల్పించారు. ఒకటి గృహవసతి. తన మేడకు పూరిగుడిసెలకు మధ్యగా వున్న ఖాళీజాగాలో ఆయన కొన్ని పెంకుటిళ్ళు కట్టించి పెట్టారు. వీళ్ళల్లో అర్హులైన వాళ్ళకు చిన్న ఉద్యోగంలాంటి దేదైనా యివ్వబడవచ్చునని సిఫారసు చేశారు.

మామిడి తోపుపైన కాపలా, మిరప తోటపైన పర్యవేక్షణ, అరటి తోటపైన అజమాయిషీ, వడ్ల దంపకం మిల్లులో మిషను నడిపేవాడు, సంతలకు వెళ్ళి కూరగాయలమ్ము కొచ్చేవాడు, పట్టణంలోని మిల్కు డిపోకు పాలూ, పెరుగు చేరవేసేవాడు– యిలా ఆవశ్యకతను బట్టి ఉద్యోగాలకు రూపకల్పన జరుగుతూ వచ్చింది.

రైల్లో కంపార్టుమెంటులకన్నా విశదంగానూ, ఆదర్శవంతంగానూ రంగాపురంలో తరగతుల విభజన జరిగిన తర్వాత ఎన్నో తరాలు గడచిపోయాయి. ఎవరి ధర్మాలు వాళ్ళు తూచా తప్పకుండా ఆచరించడంతో రంగభూపతిగారు సంకల్పించిన ఆదర్శసమాజం మూడు పువ్వులతో ఆరు కాయలతో విలసిల్లింది. కానీ ధర్మానికి ఎప్పుడెప్పుడు ఏయే విధంగా సేగి వాటిల్లుతుందో చెప్పలేం గదా! ఇటీవల హద్దుల్ని ఆక్రమించే చర్యలు ప్రబలంగా కొనసాగాయి. క్రింది తరగతుల పెట్టెల్లో నుంచీ పై తరగతుల పెట్టెల్లోకి దాటుకోవడం ఒక సామాజిక విద్రోహమన్న నీతి స్ఫురణ మానవుల్లో పూర్తిగా నశించినట్టే కానవచ్చింది.

స్వపరభేదం ఎంచకుండా నిజం చెప్పవలసివస్తే అలాంటి సామాజిక విద్రోహుల జాబితాలో మా నాన్నగారి పేరును గూడా చేర్చవలసి వుంటుంది. ఆయన నన్ను తీసుకెళ్ళి మొదటి తరగతిపెట్టెలో కూచోబెట్టాలని కొన్ని మొండి ప్రయత్నాలు చేసి చూశాడు. ఫలించలేదనుకోండి! ఎలా ఫలిస్తుంది? అందుకు తగ్గ టిక్కట్టుండొద్దూ! అది లేకుండా అంతపనీ చేస్తే టికెట్టు కలెక్టరు పట్టుకోడా? చెవులు పిండి 'ఎక్సెస్' వసూలు చెయ్యడా? ఇదంతా మా నాన్నకేం తెలియకకాదు. కానీ అదేం గ్రహచారమో నా జేబులో వున్న టికెట్టు ఆయన కళ్ళకు ఆదినుంచి మొదటి తరగతి టికెట్టుగానే కనిపిస్తూ వచ్చింది!

చెవిలో యిల్లు కట్టుకుని పదేపదే చెబుతూ రావడంవల్లనే గావచ్చు నేను గూడా నాది మొదటి తరగతి టిక్కెట్టు కాబోలుననే భ్రమలో పడిపోయాను. నా బ్రతుకు బ్రతుకంతా ఆ భ్రమా ప్రమాదానికి లోనైపోయి వుండవలసింది. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమోమరి, ఈ మధ్యనే నాకు జ్ఞానోదయమయింది. క్షంతవ్యుణ్ణి – అసలిక్కడ కొంచెం వెనక్కి వెళ్ళి మళ్ళీ ముందుకు రావాలి.

* * *

'నువ్వు యోగ జాతకుడివిరా బాబూ!' అంటుండేవాడు మా నాన్న. మాటల కర్థమేమిటో తెలియని చిన్ననాటినుంచీ నేనీమాట వినడానికి అలవాటుపడ్డాను.

పేరుకు పెంకుటిల్లేగానీ మా యింటిలోపల పరిస్థితి పూరిగుడిసె కన్నా నిప్పచ్చరంగా వుండేది. దండెంపైన వ్రేళ్ళతో ఎంచుకోదగినన్ని బట్టలు, వంటగదిలో పదిపన్నెండు

కుండలు, మరికొన్ని సత్తుబోకులు, ఒక కొయ్యపెట్టె, రెండు నులక మంచాలు - ఇంతే మా సౌభాగ్యం. మా నాన్న చేసే ఉద్యోగానికి నిర్దిష్టంగా ఒక పేరంటూ లేదు. ప్రొద్దస్తమానం, ఒకొక్కప్పుడు రాత్రుల్లో గూడ పెదబాబుగారి యింటి దగ్గర హాజరైవుండాలి. వాళ్ళ గృహావసరాలు గమనించాలి. ఇందుకు ప్రతిఫలంగా ఆయనకు ముప్పై రూపాయల వేతనం ముడుతుండేది. ఉన్నంతలో సరిపుచ్చుకుంటూ మా అమ్మ సంసార సాగరంలో నెగ్గుకొస్తుండేది. తాత్పర్యమేమిటంటే, నేను పుట్టడమే దారిద్ర్యదేవత గారాలు పట్టిగా పుట్టాను. నా జీవిత గృహానికి సంబంధించిన తలుపులు, కిటికీలు పకడ్బందీగా మూయబడి వెలుపలినుంచీ బిగించబడి వున్నాయి. అదృష్ట దేవత ఏ సందునుంచీ నా వైపుకి తొంగి చూడగలదో నాకు తెలిసేదిగాదు.

బహుశా మా అమ్మకు గూడా యిదే సందేహం కలిగివుంటుందని నా ఊహ. ఆవిడ ఒకనాడు మా నాన్నగారిని పట్టుకుని నాలుగు దులిపేసింది. 'మీది మరీ చాదస్తమైపోయింది. యింట్లో చెబుతున్నారు గనుక సరిపోయింది. వీధిలో గనుక చెబితే నలుగురూ నవ్విపోతారు. జాతకం మంచిదైతే వీడు మన యింట్లో ఎందుకు పుడతాడండీ?' అంటూ ఆయన వాదాన్ని ఒక మాటలో కొట్టిపారేసింది.

మా నాన్న నవ్వేశాడు.

'ఒసే పిచ్చిమొగమా! సరైన దాఖలా లేనిదే నే నామాట ఎందుకంటాను? నాకు తెలుసు. వీడు యోగజాతకుడు కావాలి. అయితీరాలి. వీడు పుట్టిన లగ్నం అలాంటిది' అన్నాడు.

'ఏమిటోలెండి! ఎప్పుడడిగినా మీ రిలాగే చెబుతారు...'

అమ్మ ధోరణిలో తీవ్రత తగ్గింది కదా! నాన్న విజృంభించాడు: 'ఆ రోజు వుదయం నేను పెదబాబుగారి యింటికి వెళ్ళబోతుండగా నువ్వేమన్నావు? కడుపులో ఏమిటో నలతగా వుందన్నావు. ప్రక్కింటి తులసమ్మను చూచుకోమని చెప్పి నా పనికి నేను వెళ్ళిపోయాను. అక్కడికి వెళ్ళేసరికి అమ్మగారికి సరిగ్గా నీలాగే కడుపులో నలతగా వున్నట్లు తెలిసింది. మధ్యాహ్నం యింటికొచ్చేటప్పటికి నువ్విక్కడ కడుపునొప్పితో గింగుర్లు తిరిగిపోతున్నావు. అక్కడ అమ్మగారి పరిస్థితీ అలాగేవుంది...'

'సర్లెండి! కడుపునొప్పి అన్న తర్వాత అది అందరికీ ఒకటే! అది కలిగిన వాళ్ళకొకరకంగా వొస్తుందా? ఐతే ఒకటి. అమ్మగారికి కడుపునొప్పనగానే పట్టణానికి మనుషులు వెళ్ళారు. డాక్టరొచ్చాడు. నర్సొచ్చింది. వాళ్ళు మందులిచ్చారు, సూదులు వేశారు. నాదేముంది? ఆఖరుకు మీరయినా బిడ్డ పుట్టాకగానీ నన్ను చూడ్డానికి రాలేదు. తులసమ్మ గనుక లేకపోతే నా బిడ్డకు బొడ్డుగోసే దిక్కయినా వుండేదిగాదు...'

'నీ గొడవ నీది! నీకు దిక్కులేక పోవడమేమిటి? నీ పాలిటదేవుడే లేకపోతే అంత సుఖంగా ప్రసవమయ్యే వుండదు. ఇంతకూ నీ కసలు సంగతి తెలుసుకోవాలనే లేదు...'

'చెప్పండి' అంది అమ్మ రాజీకి దిగివచ్చి.

'సాయంకాలం ఆరుగంటలై వుంటుంది. ఆ రోజంతా ఒక్క బిర్రున ఎండలుకాసి ప్రొద్దువాటారిపోయాక ఆకాశంలో మబ్బులెక్కాయి. హోరుమంటూ గాలి ప్రారంభమైంది. ఉండి వుండీ బైర్లు క్రమ్ముకపోయేట్టుగా మెరుపులు పుడుతున్నాయి. అప్పుడున్నట్టుండి, యిళ్ళు, వూళ్ళూ అదిరిపోయేటట్టు బ్రహ్మాండంగా ఓ వురుము వినిపించింది!'

'అవున్నిజమేనండీ! ఆ వురుము ఆగిపోయేసరికి నాకు బిడ్డ కెవ్వుమంటూ ఏడవడం వినిపించింది.'

'చూశావా సుబ్బులూ! అక్కడేమయిందంటే, ఆ వురుముకాస్తా నేలపైకి దిగివచ్చి తన వెంటబడి తరుముకొస్తున్నట్టుగా నర్సమ్మ బయటికి పరుగెత్తుకొచ్చి 'మగబిడ్డ, మగబిడ్డ' అంటూ బాకా వూదేసింది.'

'ఆహా, అలాగా!' అమ్మ ముఖంలో ఒక వింత చైతన్యం పుట్టుక రావడం నేను చూచాను.

'నేనీ సంగతి ఎవరికీ చెప్పలేదనుకో! కానీ నా జాగరత్తలో నేనున్నాను. అక్కడ వాళ్ళు అయిదారుగురు శాస్తుర్లుల్ని రప్పించారు. పదిరకాల పంచాంగాలు చూశారు. పుట్టిన వేళావిశేషాన్ని బట్టి బిడ్డకు చదువు, డబ్బు, హోదా ఎందులోనూ లోటుండదనుకున్నారు. వాళ్ళబిడ్డ కక్కడ లోటుండకపోతే యిక్కడ మనబిడ్డకు లోటుండవలసిన పనిలేదు. అదీ నా లెక్క!'

అమ్మ యింకా ఆశ్చర్యంనుంచీ తేరుకోలేదు.

'నామ నక్షత్రకాన్ని బట్టి వాళ్ళు బిడ్డకు రామారావని పేరుపెట్టారు గదా సుబ్బులూ! నామకరణమన్న పేరుతో కొట్టి కోలాహలం గూడా చేశారు. నేను కానీ ఖర్చులేకుండా మన అబ్బాయికి అదే పేరు పెట్టేశాను...' అప్పటికి తనేదో ఘనకార్యం చేసినట్టు నాన్న బిగ్గరగా నవ్వసాగాడు.

'మీరేమో మంచిపనే చేశారు. కాని ఏం లాభం? మన అబ్బాయిని రామన్నా అని పిలవడమే అబ్బురం, ఎక్కువమంది 'రామిగా' అనే అఘోరిస్తున్నారు.'

'పిలుచుకోనీలే సుబ్బులూ! నవ్విన నాపచేను పండుతుంది. నీకెందుకు, నువ్వు చూస్తూవుండు.'

నా బుద్ధి నాకు తెలిసొచ్చేటప్పటికి చినబాబుగారు పట్నంలోవుండి కాన్వెంటులో చదువుకుంటున్నాడు. నేనేమో పల్లెలో ముక్కుపొడి మేష్టారుగారి దగ్గర మూడోక్లాసు చదువుకుంటున్నాను.

జన్మకాలానికి సంబంధించిన రహస్యం తెలిశాక నాకు పల్లెటూరిబడిలో చదువుకోడం అవమానకరంగా తోచింది. 'నన్ను గూడా కాన్వెంటులో చేర్పించరాదా నాన్నా?' అన్నాను.

'చదువెక్కడికీ ఒకటేరా రామూ! ఇక్కడున్న అ ఆ లు కఖాలే అక్కడ వున్నాయి. నాలుగు నాలుగుల యిక్కడా పదహారే. అక్కడా పదహారే! చదువుకోడానికెక్కడైతేనేమిరా?' అన్నాడు నాన్న.

ఆ జవాబులో సబబు లేదని నేనెలా అనగలను? ఐనా ఒక ప్రశ్న నిరంతరంగా నన్ను వెంటాడటం ప్రారంభించింది. మరైతే నాకు అదృష్టం పట్టడం ఎప్పుడు?

'ఓర్చుకో, ఓర్చుకో' అంటూ తాళజెబుతూ వుంది నా అంతరాత్మ.

అయిదో తరగతి పాసుకాగానే నాన్న నన్ను పట్టణానికి తీసుకెళ్ళి హైస్కూల్లో చేర్పించాడు. హోటల్లో అన్నం తింటూ మూడు నెలలపాటు నిశ్చింతగా చదువుకున్నాను. ఇంటి భోజనం కన్నా హోటలు భోజనం రుచిగా వుంటుందని గ్రహించాను. అదృష్టమంటే యిదే కాబోలు ననిపించింది. కానీ నాలుగో నెలపూర్తయి పదిహేనురోజులు గడచిపోయినా మనియార్డరు రాకపోయేసరికి నా అంచనా తలక్రిందులైపోయింది. హోటల్లో అన్నం పెట్టడం కుదరదు పొమ్మన్నారు. నిజంగా నా జన్మ నక్షత్రంలో గొప్ప అదృష్టరేఖ గనుక

వున్నట్టయితే అది బయటపడడానికి యింతకంటే మించిన సమయం వుండదు. వారాల కోసం ప్రయత్నిస్తూ వుండగా ఒక పెద్ద మనిషి చెప్పిన సలహా నాకు నచ్చింది. 'వారానికొకపూట అన్నం పెట్టడమేమిట్రా అబ్బీ? అన్ని పూటలూ నేనే పెట్టగలను. ఐతే నువ్వు నేను చెప్పినట్టు వినాలి. మరేం లేదు. నువ్వు మా సోడా కొట్టులో వుండిపో. అన్నం పెట్టడమేగాదు, ఆరునెలలకోసారి నీకు జతచొక్కాలు, నిక్కర్లుగూడా కుట్టిపెడతాను. అంతగా చదువుకోవాలనివుంటే ఇస్కూల్లోన్నే చదువుకోవాలని ఎక్కడుంది? లైబ్రరీనుంచి పుస్తకాలు తెచ్చుకునేదీ, తీరికున్నప్పుడు కొట్టులోనే చదువుకునేదీ' అన్నారాయన.

హోటల్లో భోజనం చేస్తూ హైస్కూల్లో చదువుకోవలసిందిపోయి సోడాకొట్టులో పనిచేసి అన్నం సంపాదించుకోవలసి వచ్చేసరికి నాకు చదువుపైన పట్టరానంత కోపం వచ్చింది. ఆకలిగొన్న తోడేలులా దొరికిన ప్రతి పుస్తకాన్ని చదివి పారేశాను. పట్టుబట్టి యింగ్లీషు ముక్కలు చదవడం గూడా నేర్చుకున్నాను. 'సోడా కొట్టులో పనిచేసే కుర్రాడు యింగ్లీషు బాగా చదవగలడ'న్న కితాబొక్కటే నాకు దక్కింది. మిగిలిన నా చదువంతా పరిగణనకు రాకుండా పోయింది.

జీవిత గ్రంథంలో కొత్త కొత్త సత్యాలను ఆరాతీసే కాలం, లోకంలో పైకి రావడానికిన్నీ చదువుకున్నూ అంత పెద్ద లంకె ఏమీలేదని కొన్ని కొన్ని దృష్టాంతాల ద్వారా నాకు తెలిసింది. సోడాకొట్టులో నా బ్రతుకు సోడాబుడ్డీ గొంతుకలో తగులుకున్న గోలీకాయలా గ్రుక్కిళ్ళు మ్రింగడంగానే వుండిపోయింది. 'ఇది పని కాదురా నాన్నా! మంచి చేతిపని ఏదైనా నేర్చుకో' మని మా నాన్న అప్పుడప్పుడూ పదో, యిరవయ్యో పంపిస్తూ వుండేవాడు. చిన్నప్పటినుంచీ పరుగెత్తుతున్న కారును చూస్తే నాలోని ఆత్మారాముడెందుకో ఉప్పొంగిపోతూ వుండేవాడు. గొప్పస్థితికి రావడమంటే కారుల్లో తిరగడమేనని భావించేవాణ్ణి. ఎందుకైనా మంచిదని కారునడపడం నేర్చుకోవాలన్న బుద్ధి పుట్టింది. ఓ లారీలో క్లీనరుగా పనికి కుదిరాను. లారీకి శుశ్రూష, లారీ డ్రయివర్లు పాపాసాహేబుకు శిష్యరికం రెండూ ఏకకాలంలో చేస్తూ వచ్చాను. సారామత్తులో జోగుతున్నప్పుడల్లా పాపాసాహేబు స్టీరింగు చక్రం నా కప్పగించేవాడు. ఒక ఏడాది కాలంలో లారీని ఆఘమేఘాలపైన తోలడం నేర్చుకున్నాను. కానీ లారీని పరుగెత్తించి ఏం లాభం? నేను నా జీవితాన్ని అందులో నూరింట ఒక్కపాలు వేగంతోనైనా పరుగెత్తించలేకపోయాను. అది ఒక చోట పడవేసిన తరువాత కదిలీ మెదలని గొంగడిలా వుండిపోయింది. ముసలితనంలో నిస్సహాయులయిపోతున్న కన్న తల్లిదండ్రులకు నేను ఊతకర్రగాగానీ, పట్టుగొమ్మగాగానీ ఉపకరించలేకపోయాను.

లారీ క్లీనరు ఉద్యోగం నుంచి డ్రయివరుగా ప్రమోషనుకోసం నేను కాంక్షిస్తుండగా పాపాసాహేబు నాకు పగవాడై పోయాడు. తన ఉద్యోగానికి నేను ఎసరు పెడుతున్నానేమో అన్న అనుమానం అతణ్ణి పట్టుకుంది. యజమానికి లేనిపోని పితూరీలు చెప్పి అతడు నన్న లారీనుంచి దించేశాడు.

అప్పుడిక చేయడానికి పనేదీలేక నేనొకనాడు నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి దిక్కులు చూస్తూ బిక్కరిస్తూ వుండగా తేమనేలపైన జారిపోయే జెర్రిపోతులా ఓ కారు సర్రునవచ్చి నా ముందు నిలిచింది.

'ఒరేయ్, నువ్వు రామన్నవి గదూ! ఏం చేస్తున్నావిక్కడ?' అన్నాడు కారులో నుంచి చినబాబు.

'అబ్బే, ఏం లేదండీ! ఉన్న ఉద్యోగం వూడిపోయింది. మళ్ళీ ఏదైనా దొరుకుతుందేమోనని...' అంటూ నీళ్ళు నమిలాను.

'డ్రయివింగు తెలుసునటగా! మీ నాన్న చెప్పాడులే! ఎక్కు కారు. కారీ మధ్యనే కొన్నానులే' అన్నాడు చినబాబు.

చినబాబు కారుకొనడం, ఆపాటికి నేను డ్రయివింగు నేర్చుకొని ఉద్యోగం కోసం వెదుకుతూ వుండడం, చినబాబు కారుతో వచ్చి వచ్చి నా ముందే ఆగడం, నన్ను కారెక్కమనడం యిదంతా ఆద్యంతమూ నాకు అత్యంత సహజ సుందరమైన విషయంగానే తోచింది.

నేను కారులో కెక్కడమూ చినబాబు ప్రక్కకు తప్పుకోవడమూ ఒక్కసారే జరిగాయి.

కారు స్టార్టయింది.

చినబాబు సిగరెట్టు ముట్టించుకుని పొగ వదులుతూ అన్నాడు. 'నువ్వు ఉద్యోగం కోసం అక్కడా యిక్కడా వెంపర్లాడడమెందుకూ? నా దగ్గరే వుండిపో!'

నిజం నిజం! అలా చేయడం వల్ల జన్మ జన్మల అనుబంధంలో నేనింకొక అడుగు ముందుకు వేసినట్టవుతుంది. ప్రపంచ నాటకంలో ఒక పాత్రధారినిలా నేను పాత్రౌచిత్యాన్ని పోషించుకున్నట్టవుతుంది.

కారు పట్టణం సరిహద్దులు దాటి పరుగిడుతోంది. గుట్ట లెక్కుతోంది. పల్లాలు దిగుతోంది. మలుపులు తిరుగుతోంది. గాలిని కోసుకుంటూ రఁయిమని దూసుకపోతుంది. కానీ ఎంత చేసినా తానెక్కడికి వెళ్తెన్నదీ కారుకు తెలియదు. ఈ విషయంలో నా పరిజ్ఞానం గూడా కారుకు డిటోగానే వుంది. అది యంత్రం, నేను మనిషిని. కానీ యంత్రంకన్నా మనిషి ఎక్కువైనవాడన్న అభిప్రాయం అప్పుడు నాలో లేదు. ఇంకా నయం! చినబాబుగారు కారును కొన్నివేల రూపాయలుపోసి కొని వుంటాడు. నాదేముంది, నేను పెట్టుబడి లేకుండా దొరికాను. అప్పటికీ ఏదో తండ్రి నౌఖరీకి ఇనాందారునై పోయానని నాపైన అభిమానం పెట్టివుంటాడంతే గానీ, నాలాంటి వాళ్ళింకెవరూ దొరక్కనా?.

'ముప్పయి ఆరో మైలురాయి దాటిన తరువాత తూర్పుగా మలుపు తిరగాలి. దండిగా కార్లూ బస్సులూ పోతుంటాయి. సూటిగా వాటి వెంటనే పోనివ్వు.' మూడో సిగరెట్టు మూసివేస్తూ అన్నాడు చినబాబు.

చినబాబు చెప్పినచోట మలుపు తిరిగి మళ్ళీ నాలుగైదు మైళ్ళు వెళ్ళిన తరువాత 'మీ చదువు పూర్తయిపోయిందంటండీ చినబాబుగారూ?' అని ప్రశ్నించాను.

'ఓ డిగ్రీ పుచ్చుకున్నానే? అది బలే గమ్మత్తుగా జరిగిందిలే! పుస్తకాలు కొనడమేగానీ నేను చదివిన పాపాన పోయిందిలేదు. పట్టుమని నాలుగు రోజులు హాస్టల్లో వున్నదీలేదు. పరీక్షలన్నీ ఖరాబు చేసేశాననుకో! ఐనా నా డిగ్రీ నా కొచ్చేసింది. చూశావా తమాషా!' పగలపడి నవ్వుతున్నాడు చినబాబు.

నా కప్పుడింకొక జీవిత సత్యం తెలిసి వచ్చింది. లోకం పక్కా బజారులాంటిది. నీ తల్లిదండ్రుల మంచితనం, నీ చదువు, ప్రతిభ, నీ సద్వర్తన యివన్నీ యిక్కడ చిల్లిగవ్వకైనా మారవు. వీటితో గడ్డిపోచనైనా కొనలేవు. ఎంతటి వస్తువునైనా కొనగలిగేది, ఎలాంటి విలువల చేతనైనా దాస్యం చేయించుకోగలిగేది వేరే వుంది. దాంతో కార్లేగాదు, డిగ్రీలు కూడా కొనుక్కోవచ్చు. కారిప్పుడొక నగరం శివార్లలోకి వచ్చేసింది. నేను నేరుగా నగరం లోపలికే వెళ్ళిపోబోతుండగా 'అలా కాదు. ఇటు' అన్నాడు చినబాబు. కారొక మైదానంలోకి

వచ్చింది. పార్కింగుకు ప్లేసులో వందలకొలది కార్లు నిలిచివున్నాయి. వచ్చే బస్సులతో వెళ్ళే బస్సులతో బస్స్టాండు హోరెత్తిపోతోంది. పెద్ద తిరణాలలాంటి జనస్తోమంతో మైదానం కిటకిటలాడిపోతోంది.

'ఏం జరుగుతోందండీ చినబాబుగారూ, యిక్కడ?' అన్నాను.

'ఎగ్జిబిషన్ జరుగుతోంది. కావలిస్తే నువ్వు గూడా తిరిగిచూడు. ఒక గంట సేపట్లో నా పనైపోతుంది. పన్నెండు గంటలకల్లా నువ్విక్కడుండాలి...'

తిరిగి చూడడమొకటే ప్రయోజనంగా నేను ఎగ్జిబిషనులోకి దారితీశాను. నడిచినంత మేరకు స్టాల్సే కనిపిస్తున్నాయి. ప్రతి స్టాలుముందరా జనం గుంపులు గుంపులుగా ప్రోగై వున్నారు. దారి చేసుకుని నడవడం నాచులో తగులుకొని ఈతగొట్టినంత సుకరంగానే వుంది. నిప్పులు చెరుగుతున్న రోహిణీ కార్తె ఎండల్లో అలా ఒక అరగంటసేపు నడిచేటప్పటికి నాలుక పిడచగట్టుక పోయింది. 'బాబూ! ఇక్కడెక్కడైనా మంచినీళ్ళు దొరుకుతాయా?' అని ఒక పెద్ద మనిషిని అడిగాను. 'అదిగో, అక్కడున్నాయి వెళ్ళ'మంటూ అతడు దొరికేచోటు చూపించి పుణ్యం గట్టుకున్నాడు.

అక్కడొక చెట్టుక్రింద కడవలో మంచి నీళ్ళుంచుకుని కూర్చున్న ముసలయ్య కనిపించాడు.

'బాబూ, ఓ గ్లాసుడు మంచినీళ్ళు' అన్నాను.

'గ్లాసు అయిదు పైసలు' అన్నాడు.

ఆలోచించడానికి గానీ, ఆశ్చర్యపడడానికిగానీ నాకు ఓపిక లేదు. పదిపైసలు చెల్లించి రెండు గ్లాసుల నీళ్ళు త్రాగేశాను.

తిరిగొస్తుండగా చినబాబు ఎదురయ్యాడు.

'మీకు దాహం వేయలేదటండీ చినబాబుగారూ? అక్కడ మంచినీళ్ళున్నాయి. వెళ్దాం రండి' అన్నాను.

'వద్దులే, నేనిప్పుడే పళ్ళరసంతీసుకున్నాను. ఎవరో ఫ్రూట్ జ్యూసు ఫ్యాక్టరీ వాళ్ళిక్కడొక స్టాలు తెరిచారు. సాంపిల్‌గా నాకోగ్లాసు కలిపియిచ్చారు' అన్నాడు చినబాబు.

స్వంతబిడ్డలకు సవతిబిడ్డలకు వున్న తేడా ఏవిటో నాకు విస్పష్టంగా తెలిసిపోయింది. అదే నేను జీవితానికి సంబంధించి తెలుసుకున్న ఆఖరు సత్యం!

♦ వేకువ మాసపత్రిక - 1963 ♦